పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, ఆగస్టు 31 : గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేసి బిల్లుల కోసం ఎదురు చూస్తున్న మాజీ సర్పంచ్‌లకు ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి పెట్టారని, బిల్లులు రాకపోవడంతో అసలు, వడ్డీలు కట్టలేక మానసికంగా కుంగిపోతున్నారన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి 8 నెలలు దాటుతున్నా గ్రామాల్లోని పరిస్థితులు, అభివృద్ధి, చెల్లింపులు, పారిశుధ్య నిర్వహణపై దృష్టిసారించక పోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించని పక్షంలో మాజీ సర్పంచులకు అండగా ఉండి బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాం, నాయకులు శ్యామ్, ప్రేమ్‌కుమార్, రాజునాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- గణేశ్, మిలాద్ ఉన్ నబీ పండుగల శాంతి కమిటీ సమావేశాలు ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ
- కమిషనరేట్‌లో డివిజన్ పోలీసు అధికారులతో సమీక్ష

పోలీసు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

హుస్నాబాద్, ఆగస్టు 31: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టి ఆ ప్రదేశంలో మళ్లీ ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ పోలీసు అధికారులకు సూచించారు. శనివారం సిద్దిపేట కమిషనరేట్‌లో హుస్నాబాద్ పోలీసు డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులతో నేరాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజూ సాయంత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా వాహనాల తనిఖీ నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరిగే చోట సైనింగ్ బోర్డులు, సైడ్‌లైట్స్ ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాటన్నారు. వినాయక చవితి, గణేశ్ నిమజ్జనం, మిలాద్ ఉన్ నబీ పండుగల నేపథ్యంలో ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి కమిటీల సమావేశంలో నిర్వహించి సూచనలు చేయాలన్నారు. ఈ పండుగల సమయంలో ప్రత్యేక నిఘా, బందోబస్తు ఏర్పాటు చేసి శాంతియుతంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ వాసాల, సీఐలు శ్రీనివాస్, శీను, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎర్రల కిరణ్, కంట్రోల్‌రూమ్ ఇన్‌స్పెక్టర్ మల్లే శంగౌడ్, ఐటీ సెల్ ఎస్సై నరేందర్‌రెడ్డి, ఎస్సైలు తోట మమేశ్, విజయభాస్కర్, నిరేశ్, రాజు, షేక్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కొలువుకే.. వ్యక్తిత్వానికి కాదు..

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31 : ఉద్యోగ విరమణ కొలువుకే.. వ్యక్తిత్వానికి కాదని పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. శనివారం కమిషనర్ కార్యాలయంలో సిద్దిపేట ఎస్సై, సీసీఎల్ నరెడ్ల ఇంద్రసేనారెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డిని సన్మానించి మెమోంటోను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పోలీస్ శాఖలో కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు 41 ఏండ్ల పాటు ఉద్యోగ నిర్వహణలో అంకిత భావంతో పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై వివరాలు సేకరణ

కొడకండ్లలో రైతు వివరాలు సేకరిస్తున్న ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు

గజ్వేల్, ఆగస్టు 31 : ప్రభుత్వం మూడు విడుతలుగా చేసిన పంట రుణమాఫీ జాబితాలో పేరులేని వారి వివరాలను వ్యవసాయాధికారులు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని పిడిచేడ్, సింగాటం, క్యాసారం గ్రామాల్లో ఏడీఏ బాబునాయక్, ఏవో నాగరాజు రైతుల నుంచి వినతిపత్రాలను తీసుకున్నారు. వ్యవసాధికారులు రైతులను నేరుగా కలిసి వారి వివరాలతో పాటు కుటుంబ గ్రూప్ ఫొటోను తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

విద్యారంగ సమస్యలు పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ కార్యదర్శి భరత్

చేర్యాల, ఆగస్టు 31 : విద్యారంగ సంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నదని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ కార్యదర్శి తాడూరి భరత్ ఆరోపించారు. పట్టణంలోని కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగాన్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం కనీసం విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో సమస్యలు చుట్టుముట్టాయన్నారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద విద్యార్థి మహాగర్జన చేపట్టిందన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. సమావేశంలో నాయకులు నస్రీన్, అజయ్, కిరణ్, మధు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

ఇందిరానగర్ పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 31 : సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరమని అదనపు కలెక్ట గరిమా అగర్వాల్ సూచించారు. శనివారం పట్టణంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలను మున్సిపల్ కమిషనర్‌తో కలిసి సందర్శించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది రోగాలకు నిలయంగా మారుతుందన్నారు. భోజనం చేసే సమయంలో తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ విషయాలపై కుటుంబ సభ్యులు, చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించాలన్నారు. అంతకు ముందు పాఠశాలలోని రోబోటిక్, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లను పరిశీలించారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

మాట్లాడుతున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్, ఆగస్టు 31 : లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కరించేందుకు పోలీసు అధికారులు, న్యాయవాదులు కృషి చేయాలని హుస్నాబాద్ మున్సిఫ్ కోర్టు జడ్జి శివరంజని అన్నారు. శనివారం కోర్టులో కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. చిన్న చిన్న కేసులతో ఏండ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా నష్టపోతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదర్చాలన్నారు. కక్షిదారులు కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో హుస్నాబాద్, చేర్యాల ఎక్సైజ్ అధికారులు, పోలీసు అధికారులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, ఏజీపీ సదానందం, కన్నోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి క్రీడాజ్యోతి ఫౌండేషన్ చేయూత

అంజలికి సాయం అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్

గజ్వేల్, ఆగస్టు 31: జాతీయ క్రీడాకారిణి ఇటీవల పీఈసెట్ ఎంట్రన్స్‌లో రాష్ట్రస్థాయిలో 29వ ర్యాంకు సాధించిన కె.అంజలి కుటుంబ ఆర్థిక పరిస్థితులు తెలుసుకొని వ్యాయామ విద్య కోర్సు చేయడానికి క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ హైదర్‌పటేల్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు విజయరేఖ, గోవర్ధన్‌రెడ్డి, నవీన్, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్‌లోపు అభివృద్ధి పనులు పూర్తి చేయండి

గృహజ్యోతి పథకం అమలుపై అడిగి తెలుసుకుంటున్న సీఎండీ ముషారఫ్

సిద్దిపేట, ఆగస్టు 31 : అన్ని అభివృద్ధి పనులు డిసెంబర్‌లోపు పూర్తి చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ అన్నారు. సిద్దిపేటలోని సర్కిల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ అధికారులైన సూపరింటెండింగ్ ఇంజనీర్, డీఈలు, ఏడీఈలు, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యుత్ డిమాండ్, సరఫరా, గృహజ్యోతి పథకం అమలు, సర్కిల్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. సర్కిల్‌లో నూతనంగా ప్రతిపాదించిన సబ్ స్టేషన్ల ఏర్పాటు, ట్రాన్స్ ఫార్మర్ల ఏర్పాటు తదితర పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలోని ఇందిరమ్మ బస్తీని సందర్శించి సీఎండీ అక్కడి ప్రజలతో గృహ జ్యోతి పథకం అమలుపై అడిగి తెలుసుకున్నారు. పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ ఆపరేషన్ డా ఎన్ నరసింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజనీర్ భిక్షపతి, సిద్దిపేట సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ చంద్రశేఖర్, డివిజనల్ ఇంజనీర్లు మహేశ్‌కుమార్, లక్ష్మినారాయణ, శ్రీనాథ్, భానుప్రకాష్, అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి

భవాని గ్రూపునకు రుణపత్రాన్ని అందజేస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న

హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 31 : బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాన్ని సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న అన్నారు. పట్టణంలో ఇందిరా మహిళా శక్తి కింద భవాని మహిళా గ్రూప్‌నకు మంజూరైన రుణపత్రాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తీసుకున్న రుణాలతో ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్, కౌన్సిలర్ బోజు రమాదేవి, మెప్మా కోఆర్డినేటర్ ముత్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసాభివృద్ధి

పతకాలు అందుకున్న విద్యార్థులు

సిద్దిపేట టౌన్, ఆగస్టు 31 : విద్యార్థుల సమగ్ర వికాసంలో గురువుల పాత్ర కీలమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత అన్నారు. కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు శారీరక, మానసిక, ఆరోగ్య వృద్ధికి క్రీడా వేదికను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు కళాశాలలో జరిగిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం, అధ్యాపకులు గోపాల సుదర్శనం, మధుసూదన్, కృష్ణయ్య, బాలకిషన్, హరిబాబు, మేరాజ్ ఫాతిమా పాల్గొన్నారు.

రైతుల ఆలోచనల్లో మార్పు తీసుకురావాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31 : రైతుల ఆలోచనల్లో మార్పు తీసుకు రావాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు తగినట్లు వినూత్నమైన పద్ధతిలో స్థానిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని పంటలు సాగు చేయించాలని సూచించారు. ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవోలు, డైరెక్టర్లతో శనివారం కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు రిటైర్డ్ ఐఎస్ఎస్ అధికారి టీపీఎస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు సాగు భూమి వివరాలు, పంటల వివరాలు, ప్రభుత్వ పథకాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. నాబార్డు డీడీఎం జిల్లాలో ఏర్పడిన పీసీఎల్ వివరాలు, నిర్వహిస్తున్న వ్యాపార ఆర్థిక లావాదేవీలతో పాటు క్రెడిట్ లింకేజీ, ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో నాబారు, వ్యవసాయ, ఉద్యాన వన శాఖ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

యోగా విజేతలకు బహుమతులు అందజేస్తున్న విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట, ఆగస్టు 31 : రకరకాల కాలుష్యాలు పెరిగిపోతున్న సమాజంలో యోగా అనారోగ్యాల నుంచి భావితరాన్ని రక్షిస్తుందని సిద్దిపేట డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి జరిగిన జిల్లా యోగా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాల్యం నుంచే యోగా సాధన చేయాలని సూచించారు. యోగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో యోగా పరిశీలకులు కరణం గణేశ్, సిద్దిపేట పబ్లిక్ సర్వెంట్స్ హోం అధ్యక్షుడు అయిత అంజయ్య, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అంజయ్య, తోట సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మండపాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

గజ్వేల్, ఆగస్టు 31: గణేశ్ మండపాల నిర్వాహకులు తప్పకుండా నిబంధనలు పాటించాలని సీఐ సైదా సూచించారు. శనివారం పట్టణంలోని పీఎన్ఆర్ గార్డెన్స్‌లో మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతియుత వాతావరణంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు జరుపుకోవాలన్నారు. ఈ నెల 6 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

మద్దూరులో వైద్య శిబిరం సక్సెస్

రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నజియా ఫిర్దోస్

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 31 : మద్దూరు యునానీ దవాఖాన ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ నజియా ఫిర్దోస్ గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, డీపీఎంయూ డాక్టర్ భానుతేజ, ఫార్మాసిస్టు లింగం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

ధూళిమిట్టలో కూలిపోయిన ఇంటిని చూపుతున్న బాధితుడు శ్రీనివాస్

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 31 : రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి ధూళిమిట్ట మండల కేంద్రానికి చెందిన నాచగోని శ్రీనివాస్‌కు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్న సామగ్రి మట్టిపాలైంది. ఇళ్లు కూలిపోవడంతో శ్రీనివాస్ ఆశ్రయాన్ని కోల్పోయాడు. ఆర్థికంగా ఆదుకోవడంతో పాటు ఇల్లు మంజూరు చేయాలని బాధితుడు శ్రీనివాస్ విజ్ఞప్తి చేశాడు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మద్దూరు ఎస్సై షేక్ మహబూబ్ ప్రకటనలో సూచించారు. వర్షాలకు పాత పెంకుటిండ్లు కూలిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఇండ్లను వెంటనే ఖాళీ చేయాలన్నారు. వర్షాలతో ఏమైనా సమస్యలు ఉత్పన్నమయితే వెంటనే 100కు డయల్ చేయాలని కోరారు.

వర్గల్ శనీశ్వరాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

సామూహిక అభిషేకంలో పాల్గొన్న భక్తులు

వర్గల్, ఆగస్టు 31 : వర్గల్ విద్యాసరస్వతీ ఆలయంలోని శనేశ్వరుడి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శని త్రయోదశిని పురస్కరించుకొని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. పూజల కోసం భక్తులు ఆలయం ఎదుట బారులు తీరారు. ఆలయ చైర్మన్ చంద్రశేఖర శర్మ ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బందితో కలిసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు

కొమురవెల్లి, ఆగస్టు 31 : మండల వ్యాప్తంగా శ్రావణ మాసం చివరి శనివారం శనిత్రయోదశిని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. గురువన్నపేట భవాని లింగేశ్వర ఆలయంలో వేదపండితుడు మహాదేవభట్ల ఆనంద్‌శర్మ ఆధ్వర్యంలో శనిత్రయోదశిని పురస్కరించుకొని అభయాంజనేయ స్వామికి అభిషేకం నిర్వంచడంతో పాటు చందనం పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బుడిగె గురువయ్య గౌడ్, పబ్బోజు కోటేశ్వర్‌చారి, ఆలకుంట బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ప్రాంతీయ కేంద్రం సమన్వయకర్తగా శ్రద్ధానందం

సిద్దిపేట టౌన్, ఆగస్టు 31 : సిద్దిపేట అంబేద్కర్ ప్రాంతీయ కేంద్రం సమన్వయకర్తగా డాక్టర్ శ్రద్ధానందం శనివారం నియమితులయ్యారు. కళాశాలలో ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొపెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రద్ధానందం అంబేద్కర్ ప్రాంతీయ కేంద్రానికి సమన్వయకర్తగా అదనపు బాధ్యతలను నిర్వర్తించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అధ్యాపకులు మధుసూదన్, గోపాల్ సుదర్శనం, అనురాధ ఆయనను అభినందించారు.

మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

మహిళలకు కుట్టు మిషన్లు అందజేసిన రోటరీ క్లబ్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి

ములుగు, ఆగస్టు 31 : మండల పరిధిలోని అన్నాసాగర్‌లో శనివారం ఐదు గురు మహిళలకు రోటరీ క్లబ్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు సామల నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి సాయిరెడ్డి, మాజీ చైర్మన్లు కరుణాకర్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మట్టిని తరలిస్తున్న టిప్పర్లు సీజ్

కొమురవెల్లి, ఆగస్టు 31 : అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను సీజ్ చేశామని ఎస్సై రాజుగౌడ్ గౌడ్ తెలిపారు. కొమురవెల్లి శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారని శనివారం పోలీసులకు సమాచారం వచ్చింది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కొమురవెల్లి పోలీసుల ఆధ్వర్యంలో మట్టిని తరలిస్తున్న ఆరు టిప్పర్లు, ఒక హిటాచిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచకపోతే యుద్ధం తప్పదు

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగమయ్య

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 31: ఎన్నికల సమయంలో దివ్యాంగుల పింఛన్లను పెంచుతామని హామీని నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం తప్పదని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగమయ్య హెచ్చరించారు. హుస్నాబాద్‌లో శనివారం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగమయ్య మాట్లాడుతూ.. దివ్యాగుల పింఛన్ రూ.6వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు గడిచినా ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. సమావేశంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సమ్మయ్య, మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, నాయకులు చిట్టిరాజు, యాచారం జంగయ్య, మహ్మద్ సలీం, చెరుకూరి భానుప్రసాద్, కనకయ్య, యాదగిరి, అర్చన, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

బెజ్జంకి, ఆగస్టు 31: జిల్లా, డివిజన్ కేంద్రాల్లో సెప్టెంబర్ 1న నల్లబ్యాడ్జీలతో జరిగే నిరసన ప్రదర్శనలో ఉపాధ్యాయులు పాల్గొనాలని ఎస్‌టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్ అనేది ఉద్యోగికి భిక్షకాదు, హక్కు అన్నారు. సీపీఎస్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట కలెక్టరేట్, ఆగస్టు 31 : భారత రిజర్స్ బ్యాంకు ఏర్పడి 90 ఏండ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా అండర్ గ్రాడ్యుయేషన్ కళాశాల విద్యార్థులకు ఆర్బీఐ 90 క్విజ్ పోటీలను ప్రారంభించనున్నది. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం కలెక్టర్ మనుచౌదరి ఆవిష్కరించారు. డిగ్రీ చదువుతున్న ప్రతి విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలం



నంగునూరు, ఆగస్టు 31 : మండల పరిధిలోని సిద్దన్నపేటలో అరుదైన పుష్పమైన బ్రహ్మకమలం శుక్రవారం రాత్రి విరబూసింది. గ్రామానికి చెందిన సంగు రామకృష్ణ, జానకి దంపతుల గృహంలో ఎంతో అరుదైన బ్రహ్మకమలం మొక్కను ఆరేండ్ల నుంచి పెంచుతున్నారు. శుక్రవారం రాత్రి 12 గంటలకు మొదటి సారి తమ ఇంట్లో విరబూసిందని వారు తెలిపారు.

సుడా వైస్ చైర్మన్‌గా అశ్రిత్‌కుమార్

సిద్దిపేట, ఆగస్టు 31 : సుడా వైస్ చైర్మన్‌గా అశ్రిత్‌కుమార్ (మున్సిపల్ కమిషనర్) శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌లో సంతకాలు చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు.

మోడల్ స్కూల్ వసతి గృహం తనిఖీ

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

బెజ్జంకి, ఆగస్టు 31 : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతోపాటు, మోడల్ స్కూల్ వసతి గృహాన్ని త్రీమెన్ కమిటీ మండల సభ్యులు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, వైద్యాధికారి భాగ్యలక్ష్మి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, ఆహార పదార్థాల నిల్వలు, తరగతి గదులు, పడుకునే గదులు, హాజరు రిజిష్టర్లు, స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. హాస్టళ్లలోని సమస్యలు, విద్యార్థులకు విషజ్వరాలు ఉన్నయా అడిగి తెలుసుకున్నారు. మోడల్ స్కూల్ హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కార్యదర్శిని ఆదేశించగా, హాస్టల్‌లో హెల్త్ క్యాంపు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వారి వెంట ప్రిన్సిపాల్ హర్జీత్‌కౌర్, ప్రత్యేకా